# మతి మరపు

-- భారతి భావరాజు

'మరపు' కి 'మతి మరపు'కి తేడా ఏమిటని ఒకరోజు ఆలోచించాను. నాకు తట్టిన తేడా ఏమిటంటే, చిన్నవయస్సులో వున్నప్పుడు "మరచిపోయాను" అంటే, అంత పెద్ద విషయం కాదులే చిన్నవాళ్ళమేకదా ఇంకొక క్షణంలో గుర్తొస్తుందిలే అనే ధైర్యం వుండేది. అదే వయస్సులో 50 దాటితే కొంచెం "మతిమరపు"లో కే దిగుతుంది. అంటే మన మెదడు తనకు వచ్చిన ముసలితనం తెల్పుతున్నదని అర్థం అని నేనంటాను. అసలు మావారినడిగితే, అవసరమయినవన్నీ ఒక జాబితాగా మన మెదడు గుర్తుంచుకుని, ఎక్కువ అవసరం లేనివి మరచిపోవచ్చని సలహాఇస్తూ కొన్ని మరచిపోయేలాచేసి మనకు మెదడు సహాయం చేస్తూందంటారు. ఇంకాపోతే, ఆపని మనమేచెయ్యాలి మెదడుదాకా ఎందుకు. విని వదిలేస్తే మెదడుకి సహాయం చేసినవారం అవుతాం అంటారు.

మా శ్రీవారికి ఎంతసేపూ ఇంటి విషయాలలో జమాఖర్చులూ, కట్టవలసిన బిల్స్, ఇన్స్యూరెన్స్‌లూ, పిల్లల కాలేజి చదువులకి, పెళ్ళిళ్ళకి డబ్బు కూడపెట్టడమెలా వగైరా ఆలోచించడం తప్ప, వచ్చే శనివారం రావుగారింట్లో భోజనం మాటగానీ, చెయ్యవలసిన షాపింగ్ కాని, మూడుమాట్లు ఫోను చేసిన శర్మగారికి తిరిగి ఫోనులో మాట్లాడాలానిగాని గుర్తుండదు సరికదా తీరా గుర్తుచేస్తే, నాకిదేపననుకున్నావా చిన్నచిన్నవన్నీ గుర్తుపెట్టుకోవడానికి అని ఖస్సుమంటారు. అది సరే...మరి నాకు ముఖ్యమనిపించినవి మావారికి కాకపోవచ్చు, మరి వాటి విషయం? ఉదాహరణకి, బంధుమిత్రుల పుట్టినరోజులు, వాళ్ళ పెళ్ళయినరోజులు, వాళ్ళకి పుట్టిన పిల్లల పేర్లు, నక్షత్రాలు, వాళ్ళు పార్టీలో చేసిన పిండివంటలవంటివన్నమాట. ఇవన్నీ నాకెంతో ముఖ్యమని అని మావారితో చాలాసార్లు వాదించాననుకోండి! నిజంచెప్పాలంటే, కాలెండరులో కొత్తసంవత్సరం మొదలవగానే ఎవరెవరికి ఏరోజున శుభాకాంక్షలందించాలో గుర్తుగా రాసుకుని మరచిపోకుండా ఫోనులోనో, కార్డుద్వారానో సందేశం అందచేసేదాన్ని మొన్నమొన్నటిదాకా. మాఇంట్లో అడిగినవెంటనే ఫోన్ నెంబర్లు కంఠతాగా చెప్పి "టెలిఫోన్ డైరక్టరీ" అనే బిరుదు తెచ్చుకున్న నేను, ఈమధ్య నా సెల్ నెంబర్ నాకే గుర్తుండదేమోనని "A" క్రింద దాచాను. అసలు ఈ విషయంలో మావారి దిష్టి తగిలిందేమేననిపిస్తుంది అప్పుడప్పుడు. ఈమధ్య (వయస్సుతో పనేముంది కాని) ఇందాక చెప్పినవి ఏవి గుర్తుండటంలేదు. కొంతకాలం క్రితం ఇల్లాంటివి "సీనియర్ ముమెంట్" అని అందరూ అనేసుకుంటూ నవ్వుకునేవాళ్ళం. మరి నిజంగానే ఈ సీనియర్సులోకి చేరాననిపిస్తోంది నాకు ఈమధ్య!

మా అమ్మాయి తరచు "మతిపోతోంది" -- loosing my mind -- అన్నీ మరచిపోతున్నానంటున్నది. నువ్వు చిన్నదానివి, నీకు గుర్తుంచుకోవాలంటే చాలా విషయాలు, చేయవలసినవెన్నో వుండడంతో అలా అనుకుంటున్నావని సర్ది చెప్తాను. మరి నా మతిమరుపుకి మాత్రం అంత సులభమైన సమాధానం రాదు ఇంక అని నిర్ధారణలోకి వచ్చాను.

ఒక్కొక్కప్పుడు వంటిల్లు వదలి మెట్లదాకా వచ్చిన నాకు అసలు ఎందుకు అక్కడికి వచ్చానో, ఎక్కడకు వెళ్తున్నానో గుర్తురాక కోపం, నిస్పృహ, నీరసం, చివరకి నామీద నాకే జాలితో ఏమిచెయ్యాలో తోచదు. అప్పుడే కొందరి సలహా పాటించి, వెనక్కి తిరిగి మళ్ళీ వంటగది వేపుకి వెళ్ళి మెదడుని "రీవైండ్" చేసి, అసలు మొదటి అంశం గుర్తుతెచ్చుకోవడానికి ప్రయత్నిస్తాను. అసలు విషయం గుర్తుకు రాగానే కలిగే ఆనందం, వెనకే నా చిన్న చిరునవ్వుతో నా బుర్ర నా వశానికి వచ్చిందిలే అనుకున్న రోజులున్నాయి.

ఒకసారి నా వయస్సులో వున్న పదిమంది కలిసినప్పుడు, అనుకోకుండానే మాటలు "మతిమరపు" మీదికి మళ్ళాయి. తలమీద కళ్ళద్దాలు పెట్టుకొని ఇల్లంతా వెదకిన కథ, ఫ్రిజ్‌లో పెట్టిన ఉప్పుసీసా గురించిన కథ, తాళాలగుత్తి కోటుజేబులో పెట్టుకొని ఇంట్లో అందరిమీదా అపవాదు వేసిన మరొక పెద్దమనిషి గొప్పతనం, స్టవ్ ఆన్ లో వదిలేశానా, గారేజ్ డోర్ పూర్తిగా మూశానా అన్న అనుమానాలతో కొంత దూరం వెళ్ళి తిరిగొచ్చిన వృత్తాంతాలు కొందరు, దిగవలసిన స్టేషన్ లో దిగడం మరచిపోయి ఇంకొక చోటదిగి, తరువాత పడిన అవస్థ గురించి మరొకరు, అదే కాకుండా, మాటలలో ఏదో చెప్పబోయి ఎటో కథలల్లుకుంటూ ఎక్కడికో వెళ్తూ మధ్యలో "అన్నట్టు అసలు విషయమేమంటే" అని భూగోళమంతా తనతోబాటు మమ్మల్నీ గిరున తిప్పి తీసుకొచ్చిన మిత్రులొకరు. ఇలా ఒకరి తరువాత ఒకరు ఏవిధమయిన సంకోచం లేకుండా తమగురించి తముగా చెప్పుకుపోతున్నారు. పైకి అంతా నవ్వుకుంటూ గడిపాము. కానీ ఇంటికొచ్చాక, మిగతవారి సంగతి నాకు తెలియదుకాని, ఆరోజు నాకు మాత్రం ఇదేకదా "మతిమరపు" అంటే అనిపించింది. చిన్నప్పటంత

నవ్వురాలేదు సరికదా మనస్సులో ఆందోళన మొదలయింది.

వయస్సు 50దాటినవాళ్ళ మతిమరపు గురించి అలా వుంచండి, ఇప్పుడు 20, 30వపడిలోఉన్నవాళ్ళ బాధల్ని చూసి "నవ్వాలో ఏడవాలో తెలియదు" అన్న సామెత గుర్తుకొస్తుంది. ఇంట్లో సెల్ ఫోను పోగొట్టుకొని, దానిని వెదకడం కోసం, ఇంకొక ఫోనునుంచి కనిపించని ఫోనునెంబరురింగ్ చేస్తూ, ఇంటిల్లిపాదీ చిన్నపెద్దల్నందర్నీ ఖంగారు పెడుతూండడం, ఆరింగ్ వినపడగానే దాగిన ఆసెల్ఫోను దొరకడం, ఆతరువాత వానవెలసినట్టు అందరూ ఎవరి పనులకి వాళ్ళు మళ్ళడం పరిపాటయింది. ఇంకొక తమాషా, సెల్ఫోనులో మాట్లాడుతూ పార్కింగ్ లాట్లో తమ కారు ఎక్కడ వదిలారో మర్చిపోయి, పనికాగానే తిరిగి వచ్చి తాళాలలో ఉన్న "క్లిక్కర్" తో మిగతకార్లచుట్టూ ప్రదక్షిణాలు చెయ్యడం ఎన్నిసార్లు చూడలేదూ! ఇదంతా టెంపరరీ 'మరపు' మాత్రమే అనుకొందాం చిన్నవయస్సుకాబట్టి!

ఈమధ్య తె.క.స. సభకు వెళ్ళినప్పుడు మా అమ్మాయిని తెలిసినవారికొకరికి పరిచయంచేశాను. కొంత నిశ్శబ్దం తరువాత మిగత ఖబుర్లతో గడిపాము. అవతలి వ్యక్తి అటు వెళ్ళగానే మా అమ్మాయి నన్ను పరిచయం చేశావు గాని ఆవిడెవరో నాకు పరిచయం చెయ్యలేదంది. మెల్లిగా నవ్వుతూ అసలు ఆవిడ పేరు గుర్తురాలేదే అని దాటేశాను. నిశ్శబ్దానికి అసలు కారణమది. కాని ఆరాత్రి ఆమె పేరు గుర్తొచ్చేదాకా మనస్సు కుదుట పడలేదు, నిద్ర రాలేదు. అందుకే ఈమధ్య నాలాంటి కోవకు చెందిన వాళ్ళకు ఒక సలహా. 50 సంవత్సరాలు దాటిన ప్రతివారూ కనిపించేలాగా వారి పేరుతో ఉన్న పిన్ కాని, "Hello, My Name is..." కాని తగిలించుకుంటే, నాలాంటివారికి ఈ అవమానం, ఎవరా అన్న అనుమానం రెండూ వుండవు. నన్నడిగితే ఆడవారికి 50 ఏళ్ళ వయస్సుదాటాక, డైమండ్ నెక్లస్ కన్నా పేరున్న పెండెంట్ ఉపయోగమనిపిస్తుంది.

60, 70 ఏళ్ళ వయస్సు దాటాక కొత్త మార్పులుకూడా వస్తాయంటారు. చెప్పినదే చెప్పడం, పాతవిషయాలగురించి ఎక్కువ మాట్లాడడము, ఇప్పుడు విన్నది మరో క్షణంలో మరచిపోవడం మొదలయినవి "మతిమరపు" కోవకు చెందినవి. అబ్బే! మా తాతగారికి చాదస్థం ఎక్కువండీ అంటారు యువజనం. ఏదయినా ఈ చిన్నతరం పెద్దవారిని గురించి ఆమాట అన్నప్పుడు, వారికే ఈరకమైన మతిమరపు రోజులు వస్తే ఎల్లా తట్టుకుంటారో మరి. అసలు నేనుమాత్రం మాతాతగారిని చూసినప్పుడు అనుకున్నానా నాకూ ఇల్లాంటి రోజు వస్తుందని!

*****